

**మే** నెల కావడంతో ఎండలు మండిపోతున్నాయి. పగలంతా ఎండతాకిడికి వేడెక్కిన నగరం పొద్దుగూకడంతో అప్పుడప్పుడే కాస్త చల్లబడ సాగింది. రోజంతా ఎసి రూంలో బందీలా గడిపిన నేను కాస్త తాజాగాలి పీలుద్దామని టెర్రస్ పైకి వెళ్లాను. సాయంకాలం వరకూ ఎండ పీల్చిన రూఫ్ ఇంకా వేడిసెగలు కక్కుతూనే వుంది. నేను పైకి రావడం చూసిన పని కుర్రాడు నా వెనకాలే పరుగున వచ్చి కుళాయికి పెట్టి వుంచిన రబ్బరు పైప్‌తో ఫ్లోర్‌పైన నీళ్లు చిమ్మ సాగాడు.


# ఎ గుడ్ స్పాట్ లైన్

కె. ప్రవీణ

కాస్సేపట్లో ఆ ప్రాంతం కాస్త చల్లబడినట్లనిపించింది. అక్కడ వున్న కేన్ కుర్చీలో కూర్చొని యథాలాపంగా ఆకాశం వైపు చూశాను.

లెక్కలేనన్ని చుక్కలు మినుకు మినుకుమంటూ మెరుస్తున్నాయి. వాటి మధ్యలో నిండు చంద్రుడు తన ఒక్కని కోసం హొయ లొలికిస్తున్న తారల్ని చూసి గర్వంగా నవ్వుతున్నట్లుగా వున్నాడు. సప్తరుషి మండలంలో అరుంధతీ నక్షత్రం తళుకు తళుకులాడుతూ తన ప్రత్యేకతను చూపుతోంది. నేను ఆకాశం వంక చూసిన ప్రతిసారీ ఆహా! ఎంత అందమైన దృశ్యం అనుకుంటూనే వుంటాను. చిన్ననాడు ఆరుబయట అమ్మమ్మ ఒళ్లో తలపెట్టుకుని పడుకున్నపుడు ఆ నక్షత్రాల్లో రకరకాల ఆకారాలను చేప (మీనం), ఎద్దు (వృషభం), మేక (మేషం) ఇలాంటివి చూపేది. ఈనాటికీ నేను ఆకాశం వంక చూడగానే కళ్లు వాటికోసమే వెతుకుతాయి. వాటిని చూడగానే అమ్మమ్మ గుర్తుకు వస్తుంది. నా బాల్యమూ కళ్లముందు తిరుగుతుంది. పున్నమి చంద్రుడు కురిపిస్తున్న వెన్నెల పిండారబోసినట్లుగా వుంది. ఆ వెన్నెల కాంతిలో తెల్లని నా చేతులు మరింత తెల్లగా కనిపిస్తున్నాయి. తెల్లగా నాజూగ్గా వున్న నా చేతులంటే ఆయనకి ఎంతో ఇష్టం. పొడుగ్గా, సన్నగా, నాజూగ్గా వుండే నా చేతివేళ్లను ప్రతిరోజూ కొత్తగానే చూస్తారు. వీపంతా పరుచుకుని వున్న పట్టుకుచ్చులాంటి నా కురులను నడినెత్తిపై ముడిగా వేశాను.

అప్పటిదాకా కురులకింద దాక్కొనివున్న శంఖంలాంటి నా మెడకు ఇప్పుడు



చల్లని గాలిసోకి హాయిగా అన్పించసాగింది. తెల్లని నైటీలోంచి బయటకు కనబడుతూన్న నా గులాబీ రంగు పాదాలగోళ్లు వెన్నెల వెలుగులో ముత్యాల్లా ప్రకాశిస్తున్నాయి. నా కాలివేళ్లకున్న బంగారు మెట్టెలు ఆ గోళ్ల వెలుగు ముందు వెలవెలబోతున్నాయి. సన్నికల్లుపై నా కాలివేళ్లకు మావారు మెట్టెలు తొడిగినప్పుడు ఆ స్పర్శతో కలిగిన గిలిగింత గుర్తుకు వచ్చింది. సహజంగా గులాబీరంగులో వుండే నా పాదాలు చిన్ననాడు అమ్మమ్మ నలుగుపెట్టడం వల్ల అంతటి నునుపు సంతరించుకున్నాయేమో అనిపిస్తోంది నాకు. ఎండాకాలం రాగానే నేను చిన్ననాడు అమ్మమ్మ ఊళ్లో గడిపిన రోజులు గుర్తొస్తాయి.

స్కూలుకు వేసవి సెలవులివ్వగానే అమ్మమ్మ ఊరికి వెళ్లే వాళ్లం. మాకు సెలవులొస్తే అమ్మకీ హాయిగానే వుండేది. రోజూ ఉదయాన్నే యూనిఫాంలు వేసి మమ్మల్ని బడికి సిద్ధం చేయడం, వేళకి వంట చేసి మాకు తినిపించడం, మధ్యాహ్నానికి మాచేత హోంవర్కు చేయించడం వీటన్నిటి నుండీ ఆమెకు తీరిక దొరికేది. బండెడు పుస్తకాలతో కుస్తీపట్టడం వల్ల విసిగిన మా ప్రాణాలు కాస్త తెరిపిన పడేవి. రెండు నెలలూ హాయిగా గడిపే వాళ్లం. పట్నం నుండి పల్లెకు వెళ్లిన మాకు ఆ జీవితమే వేరుగా అనిపించేది.

పట్నంలో మా దినచర్య అమ్మ స్కూలుకు వేళ అవుతూందని నిద్రలేపటంతో మొదలయ్యేది. లేవగానే గబగబా పళ్లు తోమి ఆదరాబాదరా రెండు చెంబుల నీళ్లు పోసుకుని స్నానాలు ముగించే వాళ్లం. అమ్మ హడావుడి పడుతూ చేసిన టిఫిన్ తినేసి లంచ్ బాక్సులో తోసి స్కూలుకు పరుగు తీసేవాళ్లం. సాయంకాలం స్కూలు నుండి తిరిగొచ్చాక ఇంట్లో ట్యూషన్ వుండేది. ఆ పై స్కూలు హోం వర్కు, ట్యూషన్ హోంవర్కు పూర్తి చేసే వాళ్లం. ఏ కాస్తన్నా సమయం వుంటే ఎప్పుడన్నా అన్నయ్యతో, తమ్మునితో కలసి కారమ్స్, చెస్ లాంటి ఇండోర్ గేమ్స్ ఆడేదాన్ని. శని, ఆదివారాలు ఇంటిదగ్గర్లో వున్న పార్కులో కాసేపు ఫ్రెండ్స్‌తో గడిపేదాన్ని. పరీక్షల సమయంలో అదికూడా లేకుండా శని ఆదివారాల్లో కూడా ఇంట్లో కూర్చొని చదవాల్సి వచ్చేది.

కానీ ఇక్కడ ఊళ్లో మాకంతా ఆటవిడుపే. ట్రాక్టర్లపై పొలాల వెంబడి షికార్లు చేసేవాళ్లం. చెరువులోనూ, బావుల్లోనూ ఈతనేర్చే వాళ్లం. గడ్డివాము లెక్కి జారడం భలే సరదాగా వుండేది. మేమంతా గుర్రపు బగ్గీలో పక్క ఊరి గుడిలో జరిగే జాతరకు వెళ్లేవాళ్లం. శని, ఆదివారాల్లో ఊళ్లో జరిగే సంతకెళ్లి గవ్వలూ, గచ్చకాయలూ కొనుక్కునేదాన్ని.


ఇంట్లో ఎండవేళప్పుడు పిల్లలూ, పెద్దలూ అందరం కలసి చింతగింజలతో వామనగుంటలు, గవ్వలతో పచ్చీసూ, అష్టాచెమ్మా ఆడేవాళ్లం. అన్ని ఆటల్లో నేనే గెలవాలని పంతం పట్టేదాన్ని. ఎప్పుడన్నా ఓడితే మళ్లీ నేను గెలిచే వరకూ ఆడాలని హఠం చేసేదాన్ని.

మేం ఊరెళ్లగానే పట్నం నుండి వచ్చిన మమ్మల్ని చూడడానికి ఇరుగూ పొరుగంతా వచ్చేవాళ్లు. వాళ్లపిల్లల్ని మాతో ఆడుకోవడానికి పంపేవాళ్లు. నన్ను చూసిన అందరూ చక్కని చుక్కలా వున్నాననే వాళ్లు. ఆ మాటలు విన్న అమ్మమ్మ ఎందుకనో రుసరుసలాడుతూ "చుక్కా ఇలారా" అంటూ నన్ను పెరట్లోకి తీసుకెళ్లేది. "ఊళ్లో వాళ్లందరి కళ్లూ నీ మీదే" అని గొణుక్కుంటూ దిష్టి తీసేది. నా పేరు "రోహిణి" అయినా అందరూ నన్ను "చుక్కా" అని పిలిచే వాళ్లు.

మేం ఊరు చేరేసరికి అమ్మమ్మ వాళ్లు బోలెడు చిరుతిళ్లు చేయించేవాళ్లు. నేతిగారెలూ. కజ్జికాయలూ, బెల్లపు అరిసెలూ, బొబ్బట్లూ, చేగోడీలు, జంతికలూ సిద్ధంగా వుండేవి. వాటిరుచి అద్భుతంగా వుండేది. కుండల్లో గోధుమ వన్నెకు తిరిగే వరకూ మరిగించిన పాలు రోజుకు రెండుసార్లన్నా తాగించేవాళ్లు. మందంగా తెట్టులా కట్టిన పాలమీగడలో పంచదార వేసుకుని తినేవాళ్లం. కలకండతో వండిన జున్ను చెప్పలేనంత రుచిగా వుండేది. అమ్మమ్మ కొత్తగా పెట్టిన ఆవకాయ కలిపిన అన్నం ముద్దలు తినిపిస్తూంటే ఆ ఆవకాయ ఘాటుకు కళ్లల్లోకి నీళ్లు వచ్చేవి. అన్నం ముద్దలతోబాటూ వెన్న ముద్దలూ మింగించేది. మేం ఊరొచ్చామని తెలియగానే పాలేర్లు తాటాకు వుంగాల్లో చుట్టిన తాటి ముంజలు తెచ్చిచ్చే వాళ్లు. అమ్మమ్మ వాటిని చిదిమి వాటిల్లోని నీళ్లు తాగించేది. తొక్క ఒలిచి గుజ్జును తినిపించేది. ఇక మామిడి పళ్లకయితే అంతేలేదు. ఉదయాన్నే పెద్దపెద్ద గంగాళాల్లో మామిడి పళ్లు నానేసేవాళ్లు. ఒక్కొక్కళ్లూ చిన్నరసాలు ఓ పదన్నా లాగించేవాళ్లు. తాతయ్యా వాళ్లు మామిడి పళ్లు తిని లేచాక చూస్తే టెంకలూ, తొక్కలూ రాశులుగా పడి వుండేవి. ఆ పళ్ల రుచే వేరుగా వుండేది. మేము ఊళ్లో వున్నన్నాళ్లూ ప్రతిరోజూ విందులానే వుండేది. కనీసం నాలుగైదు రోజులకొక గొర్రె ఎన్నో కోళ్ల తలలు తెగేవి. నేను సెలవుల తర్వాత పట్నం వచ్చాక స్కూలు యూనిఫాం వేసుకుంటే కురుచగా, బిగుతుగా అనిపించేవి. అమ్మ మళ్లీ కొత్తవి కుట్టించేది. నా గౌనులూ, పరికిణీలూ కూడా పొట్టిగా అయ్యేవి. అమ్మమ్మ నలుగుపిండితో స్వయంగా ఒళ్లంతా రుద్ది స్నానం చేయించేది. రెండువారాల్లోనే ఒళ్లంతా నునుపు తేలేది.

నాకా ఊళ్లో నచ్చని విషయాలు కూడా కొన్ని వుండేవి. చేదుగా వుండే వేపపుల్లతో పళ్లు తోముకోవడం నాకిష్టం వుండేది కాదు. కుంకుడు కాయలు వేడిగా వున్న గంజిలో నానవేసి తలంటేవాళ్లు. కుంకుడురసం కళ్లల్లోకి వెళ్లి కళ్లు మండిపోయేవి. కాకపోతే జుట్టుమాత్రం పట్టుకుచ్చులా అయ్యేది. నాకా ఊళ్లో అసలే నచ్చని విషయం కర్రెతాత. పట్నం నుంచి వచ్చిన మమ్మల్ని చూడడానికి పనిగట్టుకొని మరీ వచ్చేవాడు. మాకు తాత వరుస అవుతాడు. నల్లగా, జీడిగింజ రంగులో వుండేవాడు. అందరూ కర్రెతాత అని పిలిచే వాళ్లు. ఆయనంటే నాకు హడల్...! నేను బాగా చిన్నపిల్లగా వున్నప్పుడు ఆయన నన్నెత్తుకుంటే నేను దడుచుకొని ఏడ్చేదాన్నట.

నేను నాలుగైదేళ్ల వయసులో వున్నప్పుడు ఆయన నన్ను దగ్గరకు పిలిచి ఎత్తుకోవాలని ముచ్చటపడితే వద్దని గింజుకునేదాన్నట. ఆ నల్లరంగు నాకంటుకుంటుందని ఏడ్చేదాన్నట. నే కాస్త పెద్దయ్యాక ఆయన నాతో "ఏమే చుక్కా నీ తెల్ల తోలు చూసుకొని మిడిసిపడకు. నీకు నేరేడు పండులా నల్లగా నిగనిగలాడే అబ్బాయిని తెచ్చి పెళ్లి చేస్తాను" అనేవాడు. కర్రెతాత మాటలకు నేను బెంబేలు పడేదాన్ని. పెళ్లంటే ఏంటో అర్థం కాని వయసులో కూడా నల్లటి మొగుడు అనే మాట నాకు రుచించక పోయ్యేది. రాత్రిళ్లు నిద్రలో ఉలిక్కిపడి లేచి "అమ్మా నాకు నల్లటి మొగుడు వద్దు" అని ఏడుస్తూ కూర్చునే దాన్ని.



''పిచ్చితల్లీ, తాత ఏదో సరదాకి అలా అంటాడు. నీకు నల్లటి మొగుడు ఎందుకు వస్తాడే తల్లీ...! చక్కని చంద్రునిలాంటి వరుణ్ణి వెతుకుతాను సరేనా...! అంటూ అమ్మమ్మ ఓదార్చేది.

సెలవులయ్యాక మొదటిరోజు స్కూలుకెళ్లి లంచ్ అవర్లో నా స్నేహితులతో మా ఊరి విశేషాలు కథలు కథలుగా చెప్పేదాన్ని. నా ఫ్రెండ్స్ కూడా వాళ్లు వెళ్లిన చోట్ల గురించి చెప్పేవాళ్లు. మేం అలా మాట్లాడుకుంటూంటే నా క్లాస్‌మేట్ శశాంక్ కాస్తదూరంగా కూర్చొని అన్నీ వినేవాడు. కబుర్లన్నీ అయ్యాక నా దగ్గరగా వచ్చి మీ ఊళ్లో ఏం తింటారేంటి..? గుడ్ ఫాట్ హెన్ (చక్కగా వొళ్లు చేసిన కోడిపెట్ట)లాగా తయారయి వస్తావు'' అంటూ నవ్వేవాడు. నాకు పిచ్చికోపం వచ్చేది.

''ప్చ్... పాపం నువ్వేమో సెలవుల్లో కలకత్తా వెళ్తే అక్కడ తినడానికి ఏం దొరకదా ఏమిటి బక్కచిక్కిన ఒంటెలా వున్నావు'' అనేదాన్ని జాలినటిస్తూ.

శశాంక్ సన్నగా పొడుగ్గా వుండేవాడు. వాళ్లు బెంగాలీలు. శశాంక్ తండ్రి బి.హెచ్.ఇ.ఎల్ లో ఉద్యోగి. కలకత్తా నుండి హైదరాబాద్ వచ్చారు. శశాంక్ ఈ స్కూల్లో మూడో క్లాసులో జాయిన య్యాడు. మేము ముఖాలు చూసుకున్న వేళావిశేష మేమిటో గానీ మా ఇద్దరికీ ఒక్క క్షణం పడేది కాదు. నేను ప్లే గ్రౌండ్‌లో వుంటే నా పక్కనుండి

''ఒన్ టూ బకిల్ మై షూ... నైన్ టెన్ ఎ గుడ్ ఫ్యాట్ హెన్'' అని పాడుకుంటూ వెళ్లేవాడు. శశాంక్ పోరు భరించలేక నేను క్లాస్‌టీచర్‌కి కంప్లైంట్ ఇచ్చాను.

''శశాంక్ ఈజ్ ఇట్ ట్రూ?'' అని అడిగారు టీచర్.

''నో టీచర్, రోహిణీ ఈజ్ మిస్టేకెన్. వన్ టూ బకుల్ మై షూ అనే రైమ్ అంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పటినుండీ అలా రిసైట్ చేస్తుండడుం నాకల వాటు అంతే'' అన్నాడు తెలివిగా.

''నో టీచర్, శశాంక్ అబద్ధం చెబుతున్నాడు. ఆ మాటలు నా గురించే అన్నాడు,' కావాలంటే వీళ్లనడ గండి'' అన్నాను నా స్నేహితుల వంక చూపుతూ.

కానీ నా స్నేహితులెవ్వరూ నోరు విప్పలేదు. ఎందుకంటే శశాంక్ వాళ్లని చూపులతోనే బెదిరిస్తు న్నాడు. ఒకవేళ ఎవరైనా నోరు విప్పితే బయటకు వెళ్లింతర్వాత చావగొడ్తాడు. శశాంక్ అంటే అందరికీ భయమే, ఎవరూ ఏమీ మాట్లాడకపోవడంతో టీచర్ అతన్ని పనిష్ చెయ్యలేక పోయారు.

అసలు శశాంక్‌కి నేనంటే అసూయ. నేనీమధ్య క్లాసులో ఎప్పుడూ ఫస్ట్‌ర్యాంక్ తెచ్చుకుంటున్నాను. మొదట్లో మా ఇద్దరి మధ్యా పోటీ బాగా వుండేది. చిన్నక్లాసుల్లో వుండగా ఒకసారి నేనూ మరోసారి శశాంక్ పోటీపోటీగా ఫస్ట్‌ర్యాంక్ తెచ్చుకునే వాళ్లం. ర్యాంక్ పోగొట్టుకున్నప్పుడు నేను ఏడ్చేదాన్ని. మరింత పట్టుదలగా చదివేదాన్ని. ఎనిమిదో క్లాసు లోకి వచ్చినప్పటినుండీ అన్ని యూనిట్ పరీక్ష ల్లోనూ, క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ పరీక్షల్లోనూ నాకే ఫస్ట్ ర్యాంక్ వచ్చేది. లెక్కల్లో నాకెప్పుడూ నూటికి నూరు మార్కులు వస్తున్నాయి. శశాంక్‌కి ఈ మధ్య లెక్కల్లో ఎప్పుడూ నూరు మార్కులు రాలేదు. అందుకే సెకండ్ ర్యాంక్‌తో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. నాపై ఆ అక్కసు ఇలా తీర్చుకుంటున్నా డని కసిగా అనుకునేదాన్ని.

రానురానూ నాకూ శశాంక్‌కూ మధ్య స్పర్ధ పెరుగుతూనే వుంది.

స్కూల్లో జరిగే ఆన్యువల్‌డే ప్రోగ్రాంలో 'యూని వర్స్' అనే ఇంగ్లీషు నాటకం వేస్తున్నాము. అందు లోని పాత్రలకు తగ్గట్టుగా స్టూడెంట్స్‌ని భూమాత, సూర్యుడు, చంద్రుడు, చుక్కలు, నవగ్రహాలు వీటి ఊహారూపాలుగా మేకప్ చేస్తున్నారు. ఈ నాట కంలో చంద్రునిగా శశాంక్‌ని ఎంపిక చేశారు. భూమాత వేషం నా స్నేహితురాలు శిరీష వేస్తోంది. తార వేషం నాచేత వేయిస్తున్నారు. మేకప్ పూర్తవు తుండగా శశాంక్ వాళ్ల మమ్మీ గ్రీన్‌రూంలోకి వచ్చారు. ఆవిడ తన కెమెరాతో చంద్రుని వేషంలో వున్న శశాంక్ ఫొటోలు తీశారు. పక్కనే తార వేషంలో వున్న నన్ను చూసి ''వావ్... యూ ఆర్ లుకింగ్ లైక్ ఎ లిటిల్ ఏంజిల్, యువర్ ఐస్ ఆర్ షైనింగ్ లైక్ స్టార్స్'' అన్నారావిడ చనువుగా నా బుగ్గ గిల్లుతూ.

ఆవిడ మాటలు విన్న నేను గర్వంగా శశాంక్ వైపు చూశాను. ఆమె నన్నూ, శశాంక్‌నీ పక్కపక్కనే నిలబెట్టి మరో స్నాప్ తీసుకొని వెళ్లారు. ఆవిడటు



వెళ్లగానే శశాంక్ నా దగ్గరకు వచ్చి నువ్వీ వేషంలో ఎలావున్నావో చెప్పనా...! అన్నాడు.

ఈ ఒక్కసారన్నా నన్ను మెచ్చుకుంటాడేమో అనుకున్నాను. కానీ, ''యూ ఆర్ లుకింగ్ లైక్ ఎ గుడ్ ఫాట్ హెన్'' అని అక్కడినుంచి రివ్వున పరుగెత్తాడు. ఆ మాటలకు పక్కనే వున్న శిరీష ఫక్కున నవ్వింది. నా కళ్లలో నీళ్లు తిరిగాయి. నా మేకప్ చెరిపేసుకోవాలన్నంత ఉక్రోషం కలిగింది. కానీ ఇంతలో మా నాటకం పేరు అనౌన్స్ చేయడంతో టీచర్ మమ్మల్ని వరుసక్రమంలో నిలబెట్టి స్టేజీ పైకి తీసికెళ్లారు.

నాటకం వేస్తున్నంతసేపూ శశాంక్ కళ్లు నన్నే చూస్తున్నాయనిపించింది.

ఆరోజు రాత్రి ఇంటికి వెళ్లాక పదేపదే అద్దంలో చూసుకున్నాను. శశాంక్ అన్నట్టుగా నేను లావుగా గుడ్ ఫ్యాట్ హెన్‌లాగా వున్నానా...?

అమ్మనడిగాను. ''అమ్మా నేను లావుగా కనబడతానా...?''

''లేదే ... ఎందుకలా అడుగుతున్నావు....?''

శశాంక్ అస్తమానం నన్నలా అంటాడు...'' కళ్లల్లో నీళ్లు తిరుగుతూండగా అన్నాను.

''నిన్నాట పట్టించడానికలా అని వుంటాడు....''

''క్లాసులో ఎంతోమంది వుండగా నన్నే ఎందుకాట పట్టిస్తాడు, నేను నిజంగానే లావుగా వున్నానేమో...''

''లేదు చుక్కా నువ్వెంత ముద్దొస్తున్నావో అద్దంలో చూడు...'' అమ్మ నన్ను సముదాయించాలని చూసింది.

''ముద్దుగా సరే, బొద్దుగా కూడా వున్నానా...'' రెట్టించాను.

.... అమ్మేం మాట్లాడలేదు.

''అమ్మా... చెప్పవే....?''


''అబ్బబ్బా ... చుక్కా నువ్విలా ఎవరైనా సరదాగా అన్నమాటలు పట్టుకొని తలమీద నీళ్లకుండ వున్నదానిలా ఏడుస్తుంటే అందరికీ ఇంకా యింకా ఏడిపించాలనిపిస్తుంది. నువ్వసలు ఎవరేదన్నా పట్టించుకోకుండా వుంటే మళ్లీ నీ జోలికెవరూ రారు'' అమ్మ విసుగ్గా అంటూ పనిలో నిమగ్నమైంది.

నాలో శశాంక్‌పై ప్రతీకారం తీర్చుకోవాలన్న కోరిక బలంగా వేళ్లూనుకోసాగింది. ఎప్పుడూ అతని మాటలే నా చెవిలో గింగురుమంటూంటాయి. ''ఏయ్, రోహిణీ మీ దొడ్లో పూచే గులాబీలు మాథ్స్ టీచర్‌కి తెచ్చిస్తూ భలే కాకా పడతావ్, అందుకే నీకు లెక్కల్లో నూటికి నూరు మార్కులు పడతాయి'' అని గేలిచేసేవాడు.

మొన్నటికి మొన్న టెన్నిస్ మ్యాచ్ డబుల్స్‌లో నన్నూ శశాంక్‌నీ ఒక జట్టుగా, కార్తీక్, శిరీషని ఒక జట్టుగా వేశారు. కానీ శశాంక్ స్పోర్ట్స్ సార్‌ని అడిగి నన్ను పార్ట్‌నర్‌గా తొలగించి శిరీషే కావాలని మార్చుకున్నాడు. స్పోర్ట్స్ సార్ నన్ను కార్తీక్ తో వేశాడు. శశాంక్ తన జట్టునుండి నన్నలా తొలగించడం నాకు చాలా అవమానంగా అనిపించింది. కానీ మ్యాచ్‌లో మా జట్టే గెలవడం నాకు ఊరట కలిగించింది.

నన్నంతలా అవమానించిన శశాంక్‌పై పగ తీర్చుకునే అవకాశం కోసం కాచుకున్నాను. తొమ్మిదో క్లాసు ఆన్యువల్ ఎగ్జామ్స్ అయ్యాయి. మరో ఏడాదితో స్కూల్ చదువు పూర్తవుతుంది. ఈలోపల శశాంక్ ఎప్పటికీ మరచిపోలేనంత దెబ్బ కొట్టాలనుకున్నాను.

అదృష్టవశాత్తూ నాకా అవకాశం కలిగింది.




తొమ్మిదవ తరగతి పరీక్షలు అయ్యాక మా క్లాసు స్టూడెంట్స్‌ని ఏదైనా పల్లెటూరికి ఎక్స్‌కర్షన్‌కు తీసికెళ్లాలని స్కూలువాళ్లు నిర్ణయించారు. అమ్మమ్మ వాళ్ల వూళ్లో చక్కెర మిల్లు వుంది. అక్కడ మామిడి తోటలు కూడా ఎక్కువే. ఈ సీజన్లో చెట్లనిండుగా కాచిన మామిడి కాయలతో ఆ తోటలు చూసేకొద్దీ చూడాలనిపిస్తుంది. చెట్లకు వేలాడే మామిడి కాయలు నోరూరిస్తాయి. మా క్లాస్ టీచర్‌కి అమ్మ స్నేహితురాలు కావడంతో అమ్మతో మాట్లాడి ఆ ఊరికి తీసుకెళ్లడానికి ఏర్పాట్లు చేశారు. అందరు పిల్లలూ ఎక్స్‌కర్షన్‌కి వెళ్లడానికి ఉత్సాహంగా సిద్ధమవుతున్న సమయంలో నేను శశాంక్‌తో ''వెళ్లేది మా ఊరు కాబట్టి నువ్వు మాతో రావడానికి వీల్లేదు'' అన్నాను.

''ఎందుకని?'' అన్నాడు కోపంగా.

''ఎందుకంటే నువ్వు నా బద్ధ శత్రువ్వి కాబట్టి. ఒకవేళ నువ్వుగానీ వస్తే నేనీ ప్రోగ్రామ్ కాన్సిల్ చేయించగలనుతెలుసా; నీ వల్ల అందరూ డిసప్పాయింట్ అవుతారు, బాగా ఆలోచించుకో''

బెదిరిస్తున్నట్లుగా అన్నాను.

నేనన్నంత పనీ చేస్తానని శశాంక్‌కి తెలుసు.

అనడమైతే ధైర్యంగా అన్నాను గానీ నన్ను కొడతాడేమోనని భయం వేసింది. కానీ మౌనంగా అక్కడి నుంచి సరాసరి క్లాస్ టీచర్ దగ్గరకు వెళ్లాడు. ఎక్స్‌కర్షన్‌కు బయలుదేరే స్టూడెంట్స్ లిస్ట్ నుంచి తన పేరు తీసెయ్యమని చెప్పి వెళ్లిపోయాడు. అదే ఆఖరిసారి నేను శశాంక్‌ని స్కూల్లో చూడటం.

సెలవుల తర్వాత తిరిగి స్కూలుకెళ్లిన నాకు శశాంక్ కనబడలేదు. రెండు... మూడు... వారం... పది రోజులు గడిచాయి. అతను రాలేదు. శశాంక్ లేని క్లాసులో నన్ను అల్లరి పెట్టేవాళ్లు గానీ, నాకు పోటీదారులు గానీ ఎవరూ లేరు. కానీ నాకా విషయం ఎలాటి సంతోషాన్నీ కలిగించలేదు. పైగా ఏదో వెలితిగా అనిపించింది.

శశాంక్ ఇక ఈ స్కూలుకు రాడనీ వాళ్ల నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ కావడంతో ఇక్కడ్నుంచి వెళ్లారనీ తెలిసింది. మాటల సందర్భంలో శిరీష నాతో శశాంక్‌కి సంబంధించిన ఒక విషయం చెప్పింది. అదేమిటంటే ఆ రోజు టెన్నిస్ మ్యాచ్‌లో శశాంక్ తన జట్టునుండి నన్ను తొలగించి కార్తీక్ జట్టులోకి మార్పించింది కేవలం నన్ను గెలిపించాలనే ఉద్దేశ్యంతోనేనట. ఎందుకంటే టెన్నిస్ శశాంక్ కంటే కార్తీక్ మెరుగ్గా ఆడతాడట. మ్యాచ్ గెలిచే అవకాశం కార్తీక్‌కే ఎక్కువగా వుంది.

''దేంట్లో అయినా రోహిణి ఓటమిని భరించలేదు. అందుకే ఆమెను కార్తీక్ జట్టులో వుండేలా చేశాను'' అన్నాడట.

క్లాసులో మాథ్స్ టీచర్ కూడా ఎప్పుడూ చలాకీగా వుండే శశాంక్‌ని బాగా గుర్తు చేసేవారు. ''హి ఈజ్ ఎ బ్రిలియంట్ స్టూడెంట్, శశాంక్ ఆన్సర్ షీట్ వాల్యుయేషన్ చేసినప్పుడల్లా ఒక విషయం గమనించేదాన్ని. ఎంత కష్టమైన లెక్క అయినా సాల్వ్ చేయగల శశాంక్ ఎక్కడో సిల్లీ మిస్టేక్ చేసి రెండుమూడు మార్కులు పోగొట్టుకునే వాడు. ఆ పని కావాలని చేశాడేమో అనిపించేది. ఒకసారి పిలిచి అతన్ని నిలదీసి అడిగాను. సమాధానమేమీ చెప్పకుండా ముభావంగా వుండిపోయాడు. శశాంక్

అలా చేయడానికి ఎక్కడో ఏదో కారణముందని ఖచ్చితంగా అన్పించేది.

ఆవిడ చెబుతున్నది వింటున్న నాకు కారణమేమిటో అర్థమయ్యింది. నాకు దుఃఖం ముంచుకు వచ్చింది. అది క్లాస్ రూం అన్న విషయం కూడా మరచి వెక్కి వెక్కి ఏడ్చాను.

ఆ తరువాత ఎన్నో ఏళ్లు ఎవరూ పూడ్చలేని ఆ వెలితి నన్ను వెంటాడుతూనే వుంది. శశాంక్ జ్ఞాపకాలు ఎప్పుడూ నన్ను వెన్నంటే వున్నాయి. నన్ను నేను అద్దంలో చూసుకున్నప్పుడల్లా ''గుడ్ ఫ్యాట్ హెన్'' అనే శశాంక్ మాటలు నా చెవుల్లో ప్రతిధ్వనించేవి. ఆ మాటలు నాకిప్పుడు కోపం కలిగించడం లేదు.

ఏళ్లు గడిచాయి. నా డిగ్రీ పూర్తయింది. పి.జి కూడా చేశాను. ఇంట్లో వాళ్లు నాకు తగిన వరుని కోసం గాలిస్తున్నారు.

***

ఆ రోజు నా పుట్టిన రోజు. తలారా స్నానం చేసి కొత్తదుస్తులు వేసుకొని నిలువుటద్దం ముందు నిలబడి ముస్తాబవుతున్నాను. అద్దంలో తెల్లగా నాజూగ్గా వున్న నా ప్రతిబింబం వైపొకసారి చూసుకున్నాను. ''ఎ గుడ్ ఫ్యాట్ హెన్'' ఎప్పటిలాగే శశాంక్ మాటలు వినబడినట్లనిపించింది. ఇప్పుడు శశాంక్ నన్ను చూస్తే ఆ మాటలనలేడు. నా వయసు పెరిగేకొద్దీ నాలోని బేబీ ఫాట్ తగ్గుతూ వచ్చింది. పొడవు పెరగటంతోబాటు బాగా సన్నగా అయ్యాను. ఒక్కసారి శశాంక్ తారసపడితే ఎంత బాగుంటుంది; నా మనసు బలంగా కోరుకుంటోంది.

ఇంతలో కాలింగ్ బెల్ మోగింది. వెళ్లి తలుపు తెరిచాను. ఎదురుగా తెల్లగా, పొడుగ్గా స్ఫురద్రూపి అయిన అబ్బాయి నిలబడి వున్నాడు. అతను... అతను ... శశాంక్... కళ్లు నులుముకొని మరీ చూశాను.

అవును... శశాంకే!

నా మనసులో ఏదన్నా అనుకుంటే అది నెరవేరే వరం నాకిచ్చాడేమో ఆ దేవుడు అనిపించింది నా కాక్షణంలో.

శశాంక్ లోపలికి వస్తూనే నా చెయ్యి పట్టుకొని ''పద రోహిణీ మీ అమ్మమ్మావాళ్ళ ఊరెళ్దాం'' అంటూ నన్ను లాక్కెళ్లి కార్లో కూర్చోబెట్టాడు. ఆనాటి అతని దూకుడేం మారలేదు. మేం ఊరెళ్లాము. అతడు అమ్మమ్మనీ, తాతయ్యనీ కలిసి తనేం చదివాడో; చేసే ఉద్యోగమేమిటో చెప్పాడు. రోహిణి అంటే తనకు చెప్పలేనంత ఇష్టమనీ తమ పెళ్లి జరిపించమనీ కన్విన్స్ చేశాడు. నా ప్రమేయం లేకుండా ఇవన్నీ చకచకా జరిగిపోతుంటే బొమ్మలా చూస్తుండి పోయాను. శశాంక్ చేస్తున్న పనులను వ్యతిరేకించకుండా నేనలా మౌనంగా వుండటంతోనే నా సుముఖతను గమనించిన మా వాళ్లు ఘనంగా పెళ్లి ఏర్పాట్లు చేశారు. శశాంక్ వాళ్లు బెంగాలీలు అయినా అమ్మమ్మా వాళ్లు ఇటువైపు సంప్రదాయం ప్రకారంగా వివాహం జరిపించారు. నా పెళ్లి సందడిలో వార్థక్యం మీదపడ్డ కర్రైతాత లేని ఓపిక తెచ్చుకొని తిరిగాడు. ముహూర్తం వేళ అక్షింతలు వేసి తల నిమిరి దీవించాడు మా కర్రైతాత. నేను తలెత్తి ''మా వారిని చూశావా?'' అన్నట్లు మా కర్రైతాతని చూశాను.

''ఈ తాత మాటను సాగనిస్తావా, ఎప్పుడూ నీ మాటే చెల్లాలనేగా నీ పంతం. అలాగే ఇకముందు కూడా సాగించుకోమ్మా'' అని దీవించాడు. శశాంక్ నా వంక అంతే కదా...! అన్నట్లు చూశాడు.

చుక్కలాంటి అమ్మాయికి చక్కనైన అబ్బాయి దొరికాడని పెళ్లికి వచ్చిన వాళ్లందరూ అనుకున్నారట. పెళ్లి తర్వాత నేను శశాంక్‌తోబాటు కలకత్తా వచ్చేశాను.

ఆకాశం వంక చూస్తూ గతంలోకి జారుకొన్న నేను గేటు శబ్దం వినిపించడంతో ఈ లోకంలోకి వచ్చాను. కారు లోపలికి వస్తున్న సవ్వడి వినిపిస్తూంది. బోర్డు మీటింగ్ నుంచి శశాంక్ వచ్చాడు. ఇప్పటిదాకా ఇంట్లో ఒంటరిగా వున్న నాకు నిమిషాలు గంటల్లా గడిచాయి. ఇక శశాంక్ ఇంటికి వచ్చాడంటే గంటలు నిమిషాల్లా దొర్లిపోతాయి.

ఇప్పటిదాకా నాకు తోడుగా వున్న ఆకాశానికీ, చుక్కలకూ, చంద్రునికీ వీడ్కోలు పలికి శశాంక్ కోసం కిందికి వెళ్లడానికి లేచాను.



